క్లుప్తంగా

సంపూర్ణ భగవద్గీత పారాయణం



భగవద్గీత శ్లోకాలను పఠిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సంకల్‌భాగ్‌లోని గీత ప్రచార ధామంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారయణ యజ్ఞాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గీత ప్రచార సభ్యులు డీవీ రమణ, జగన్నాథ్‌గుప్తా, అనంత అనిల్‌కుమార్ తదితరులు దాదాపు 700 శ్లోకాలను పఠించారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



ముగ్గులపోటీల్లో పాల్గొన్న మహిళలు

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి భారీ స్పందన లభించింది. లలిత పీఠంలో సంక్రాంతి పండుగను పురస్కరించిన నిర్వహించిన పోటీలకు దాదాపు 100 మంది మహిళలు హాజరయ్యారు. విజేతలకు సోమవారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేస్తామని ట్రస్టు సభ్యులు రంగధామం, జ్ఞానేశ్వరమ్మ తెలిపారు.

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి నివేదించిన 100 పాత్రల క్షీర పాయసం

కర్నూలు(సెంట్రల్) : సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీర పాయస నివేదన పూజలను మంత్ర పుష్పముతో నిర్వహించారు. ధనుర్మాసంలో స్వామి వారికి క్షీర పాయసం నివేదించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

బెదిరింపులకు లొంగేది లేదు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం బెదిరింపులకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు లొంగరని జేఏసీ సంఘాల గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో కొనసాగుతున్న సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ..ఎస్మా చట్టం ప్రయోగించినా ఎస్ఎస్ఏ ఉద్యోగులు బెదిరే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు కూడా అంగన్‌వాడీలు చేపట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, రాజు, రాజాం, వీరశేఖర్, రమణ, వెంకట్, రాముడు, చిట్టెమ్మ, కృష్ణవేణి, శివమ్మ, సత్యమ్మ, నిర్మల పాల్గొన్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.688 టీఎంసీల నిల్వ ఉంది.

వెలకట్టలేనిది స్నేహం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: స్నేహం వెలకట్టలేనిదని, స్నేహం విడదీయరాని బంధమని గార్గేయపురం హైస్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం ఎస్ఏ గఫూర్ అన్నారు. ఆదివారం కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్‌కి చెందిన ఆ స్కూల్ పూర్వ విద్యార్థులు సమావేశం అయ్యారు. సమావేశానికి నాటి విద్యార్థులకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులను అతిథులుగా ఆహ్వానించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు స్కూల్ ఆవరణలో తిరుగుతూ నాటి జ్ఞాపకాలను నేమరేసుకున్నారు. చదువు చెప్పిన టీచర్లను సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాలిరెడ్డి, శ్యామలాదేవి, వసంతకుమారి, బాల మద్దయ్య, రమాదేవి, పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, సలావుద్దీన్, రంగస్వామి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● అండర్–14 రగ్బీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య





పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ బీవై రామయ్య తలపడుతున్న మహిళల రగ్బీ జట్లు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని అందులో రాణించాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం స్థానిక కోల్స్ జూనియర్ కళాశాల మైదానంలో మహిళలు, పురుషుల అండర్–14 రగ్బీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. తమ ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఆడుదాం- ఆంధ్ర పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుందన్నారు. పాల్గొనే వారికి టీషర్టులు, క్యాప్స్, స్పోర్ట్స్ కిట్లు అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు రూ.12 కోట్ల నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కళాశాల చైర్మన్ డాక్టర్ నజీర్ అహమ్మద్, ప్రిన్సిపాల్ మణీ దీపిక, రగ్బీ సంఘం జిల్లా కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హాస్టల్ విద్యార్థిని



వీణకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఇంపాక్ట్ మోటివేషన్ బృందం సభ్యులు

కర్నూలు(అర్బన్): నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నెంబర్:1 కళాశాల బాలికల వసతి గృహం విద్యార్థిని బి. వీణా రాష్ట్ర స్థాయిలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన నట్లు వసతి గృహ సంక్షేమాధికారిణి బి. బెన్నమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన బీ క్యాంప్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరించిందన్నారు. ఈ నేపథ్యంలోనే వీణను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. అలాగే 6వ తేదీన జరిగిన నగర స్థాయి రగ్బీ పోటీల్లో రన్నర్‌గా నిలిచి హాస్టల్‌కు మంచి పేరు తీసుకువచ్చిందన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్న వీణను జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు అభినందించారన్నారు.

● పారదర్శకత నిరూ'పింఛన్'



శేఖర్‌కు మంజూరైన పెన్షన్ సొమ్ము అందజేస్తున్న కార్పొరేటర్ సొంపల్లి క్రిష్ణాకాంత్ రెడ్డి

కర్నూలు (టౌన్): సంక్షేమ పథకాల మంజూరులో వివక్ష చూపుతున్నారని, అర్హులకు అందడం లేదని ప్రతిపక్ష టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారు. దురుద్దేశంతోనే వారు అలా చేస్తున్నారనడానికి టీడీపీ కార్యకర్తకు కొత్తగా మంజూరైన పెన్షనే అందుకు నిదర్శనం. నగరపాలక సంస్థ పరిధిలోని 49 వ వార్డు (133వ సచివాలయం పరిధి)లో టీడీపీ కార్యకర్త శేఖర్ నివసిస్తున్నాడు. ఇతను ఇటీవల వృద్ధాప్య పెన్షన్ కోసం వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన ప్రభుత్వం నూతనంగా పెన్షన్ మంజూరు చేసింది. దీంతో ఆదివారం స్థానిక కార్పొరేటర్ సోంపల్లి క్రిష్ణాకాంత్ రెడ్డి శేఖర్ ఇంటికి వెళ్లి వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద రూ. 3000 అందజేశాడు. కాగా అతని భార్యకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18, 750 చొప్పున సాయం అందుతోంది. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 56,250 అందింది. దీంతో పాటు కంటి చూపు సక్రమంగా లేకపోవడంతో డిజేబుల్డ్ పెన్షన్ కింద నెలకు రూ.3 వేలు ఇస్తుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తుందనడానికి ప్రతిపక్ష పార్టీకి చెందిన శేఖర్ కుటుంబమే ఓ నిదర్శనం.

● ఆసుపత్రికి వెళ్లి..



ఆసుపత్రిలో ఖాజాహుస్సేన్‌కు పెన్షన్ ఇస్తున్న 7 వ వార్డు కార్పొరేటర్ జుబేర్ అహమ్మద్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 7 వ వార్డుకు చెందిన ఖాజహుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ప్రతి నెల మాదిరిగా పెన్షన్ అందజేసేందుకు వలంటీర్ శివ ఇంటికి వెళ్లాడు. ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రిలో ఉన్నాడని తెలిసింది. వెంటనే వలంటీర్ శివతో పాటు వార్డు కార్పొరేటర్ జుబేర్ అహమ్మద్ ఆదివారం పెద్దాసుపత్రికి వెళ్లి ఖాజహుస్సేన్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3000 పెన్షన్ అందజేశారు. చెంతకు వచ్చి పింఛన్ అందజేయడంతో ఆయన కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వ్యాధుల నుంచి కోలుకోవడంలో రిహాబిలిటేషన్ కీలకం



పిల్లలచే జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): వ్యాధులను అధిగమించడంలో రిహాబిలిటేషన్ థెరపీ, ఫిజియోథెరపీ చాలా దోహదం చేస్తాయని కిమ్స్ కర్నూలు యూనిట్ హెడ్ డాక్టర్ సునీల్ చెప్పారు. ఆదివారం కిమ్స్ హరితం బ్లాక్‌లో కిమ్స్ హరితం 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో అన్ని రకాల సౌకర్యాలతో చిన్నపిల్లలు, పెద్దలకు ఒకేచోట రిహాబిలిటేషన్ కిమ్స్ హాస్పిటల్‌లో ఉందన్నారు. ఇటీవల కాలంలో చిన్నపిల్లల్లో అనేక రకాలైన న్యూరోసమస్యలను చూస్తున్నామని అన్నారు. ఫిట్స్, అరుదైన న్యూరో సమస్యలకు విజయవంతంగా చికిత్స అందించినట్లు చెప్పారు. రాయలసీమలోని అన్ని జిల్లాలకు చెందిన వారితో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడ వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. మాటలు రాని పిల్లలకు ఇక్కడ ప్రత్యేకంగా స్పీచ్‌థెరపీ నేర్పిస్తారని చెప్పారు. అంతేగాక న్యూరో రిహాబిలిటేషన్, కార్డియో రిహాబిలిటేషన్ సదుపాయం ఉందని తెలిపారు. కార్యక్రమంలో చిన్నపిల్లల న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేతరాంపల్లి, డాక్టర్ అజర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో నాయకులు హుస్సేన్, శిరీషలతో కలసి మీడియాతో మాట్లాడారు.

ఉయ్యాలవాడ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం అన్యాయం

కర్నూలు(సెంట్రల్): అనంతపురం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉయ్యాలవాడ నరసింహరెడ్డి బ్రిటీషోళ్లను సైతం గడగడలాడించి రెడ్డి సామాజిక వర్గానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకరరెడ్డి, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె సమస్యలపై అలసత్వం చేయవద్దు



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఏ వయస్సు వారైనా గుండె సమస్యలపై అలసత్వం వహించరాదని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి, కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. జయమ్మతో కలిసి డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ జర్నలిస్టు వృత్తిలో ఉన్న వారు అధిక ఒత్తిళ్లకు గురవుతుంటారన్నారు. వారు వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలన్నారు. ఈ కాలంలో తక్కువ వయస్సు వారు కూడా గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమయానికి ఆహారం తీసుకోకపోవడం, మితిమీరిన ఆల్కహాలు, జంక్‌ఫుడ్, కొవ్వు పదార్థాలు అధికంగా తీసుకోవడం, సరైన నిద్రసమయాలను పాటించకపోవడం వల్ల గుండె చుట్టూ కొవ్వు పేరుకుపోతుందన్నారు. దీనివల్ల హార్ట్ ఎటాక్, ప్రధాన రక్తనాళ సమస్యలు వస్తున్నాయని చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ చేయడం ఉత్తమమని, దీని వల్ల ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. ఛాతిలో నొప్పి రావడం, అధికంగా చెమటలు పట్టడం, కొద్దిదూరం నడిస్తే ఆయాసం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్యుల వద్దకు వెళ్లాలని ఆయన సూచించారు. శిబిరానికి వచ్చిన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ బి.శంకరశర్మ, డాక్టర్ మహేష్, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్యరాముని అక్షింతలు



ఇళ్లకు వెళ్లి శ్రీరాముని అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : అయోధ్యలో 22వ తేదీన శ్రీరాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో ఇంటింటికీ శ్రీరాములు అక్షింతలు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఆదివారం బసవేశ్వర వీరశైవ లింగాయతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారపేటలోని ఇళ్లకు వెళ్లి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు లక్కీరెడ్డి అమరసింహారెడ్డి, జంపాల పార్వతమ్మ, సందడి మహేష్, కాశీ తదితరులు పాల్గొన్నారు. అలాగే మారుతి రామేశ్వర ఆలయంలో సమీపంలో ఇళ్లకు ఆలయ భక్తి మండలి సభ్యులు ఇంటింటికీ వెళ్లి శ్రీరాములు అక్షింతలు అందజేశారు.

'దేశం కోసం కావ్యం' రెండో ముద్రణ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్) : సుబ్బారాయుడు రచించిన దేశం కోసం కావ్యం అనే రెండో ముద్రణ నవలను గండూరి దత్తాత్రేయ శర్మ ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక భరతమాత గుడిలో తెలుగు సాహిత్య వేత్తల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కావ్యం ద్వారా తెలుగు భాష గొప్పతనాన్ని మరోసారి నిరూపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఆర్‌కే శర్మ, రెడ్డిసాయిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి, గోరంట్ల రమణ, టీసీ మద్దిలేటి పాల్గొన్నారు.

సమ్మె విరమించం



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించమని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎస్మా చట్టం ప్రయోగం కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్–2 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

27వ రోజు కొనసాగిన సమ్మె..

మరోవైపు అంగన్‌వాడీల సమ్మె 27వ రోజు కొనసాగింది. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మాచట్టంపై మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బంది పెట్టడం అన్యాయమన్నారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మద్దతు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో సమర్థంగా పనిచేయాలి



ఓవరాల్ చాంపియన్‌గా కైవసం చేసుకున్న ఆర్మ్‌డ్ రిజర్వు ఏఆర్ విభాగానికి షీల్డ్ అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు: రాబోయే ఎన్నికల్లో పోలీసులందరూ సమర్థవంతంగా పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. పోలీసు క్రీడల ముగింపు (స్పోర్ట్స్అండ్ మీట్) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో గెలిచిన విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేసి అభినందించారు. రెండు రోజుల పాటు జరిగిన పోలీసు క్రీడలు ఆదివారం ముగిశాయి. జిల్లా పోలీసు కార్యాలయంలోని కవాతు మైదానంలో బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మార్చ్ పాస్ట్ నిర్వహించిన పోలీసు క్రీడాకారుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో కనబరచిన స్ఫూర్తిని విధుల్లో కూడ కొనసాగించాలన్నారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో నాలుగు సబ్ డివిజన్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కలిపి మొత్తం 105 మంది పాల్గొన్నారు. 1500 మీటర్లు, 800 మీటర్లు, 400 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, జావిలిన్ త్రో తదితర గేమ్స్ అండ్ ఈవెంట్లలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అన్నింటిలో ప్రతిభ కనబరచిన ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, నాగభూషణం, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ భావన, ఏఆర్ డీఎస్పీ ఇలియన్ బాషాతో పాటు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడికి రెట్టింపు లాభం పేరుతో మోసం

కర్నూలు : ఎల్‌పీజీ యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందన్న ప్రకటన చూసి కర్నూలు సీతారామ్‌నగర్‌కు చెందిన వినోద్‌కుమార్ రూ.2.62 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. యాప్‌లో రూ.2 వేలు పెట్టుబడికి రోజుకు రూ.32 వేలు లాభం వస్తుందని ఆన్‌లైన్‌లో వచ్చిన ఒక ప్రకటన ను చూసి ఫోన్ పే ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు రూ. 2.62 లక్షలు చెల్లించాడు. ఆ తరువాత స్విచ్చాఫ్ అని రావడంతో వినోద్‌కుమార్ మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు.

మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలు కొనసాగిస్తాం



మార్పు బాలకృష్ణమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: ఏపీటీఎఫ్ వ్యవస్థాపకులు, ప్రజాతంత్ర ఉద్యమాల నాయకుడు కామ్రేడ్ మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షతన మార్పు బాలకృష్ణమ్మ 11వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హృదయరాజు మార్పు చిత్ర పటానికి పూల మాలలు వేసి ప్రసంగించారు. ఉపాధ్యాయులందరూ మార్పు బాలకృష్ణమ్మగారి స్ఫూర్తితో పోరాటాలు చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శాసన మండలిలో రైతుల సమస్యలపై ప్రభుత్వాలను నిలదీశారన్నారు. అనంతరం ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కమలాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, జిల్లా నాయకులు అబ్దుల్ మునాఫ్, సుబ్రమణ్యం శర్మ, రాఘవరెడ్డి, జనార్దన్ రెడ్డి, జయప్రకాష్ రెడ్డి, కె.తిమ్మప్ప, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భళిరా...బసవన్న

● వైఎస్ఆర్ జిల్లా కడపలో ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



ఎద్దుల యజమానులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా కడప రెడ్డి సేవా సమితి ఎద్దుల బండలాగుడు పోటీ నిర్వహించింది. ఆదివారం వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో ఈ పోటీని ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 23 జతల ఎద్దులు ఈ పోటీలో పాల్గొన్నాయి. రెడ్డి సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు గత మూడు ఆదివారాల్లో పలు పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలకు రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూడా ఎద్దుల జతలు వచ్చాయి. ముఖ్య అతిథులుగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీంద్రనాథ్, వైవీయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కె.నాగిరెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు, రెడ్డి జన సంఘ్ అధ్యక్షులు మద్దికె సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు దాదాపు రెండు వేల మందికి పైగా జనం తరలి వచ్చారు. ఈనెల 13న కడపలోని రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాల పోటీలలో విజేతలైన వారికి అదేరోజున బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

విజేతల వివరాలు

ప్రథమ బహుమతి: బీరం సుబ్రహ్మణేశ్వరరెడ్డి, ఎస్.కొత్తూరు, నంద్యాల జిల్లా.

ద్వితీయబహుమతి: చిట్టిబోయిన భరత్ కుమార్‌యాదవ్, కీర్తిపలె. మామిళ్ల సుబ్బారెడ్డి, సి.కొత్తపల్లె.

తృతీయ బహుమతి: బేస్త శ్రీరాములు, వరదాయపల్లె, అనంతపురం, పులగం తిషగ్నరెడ్డి, జస్విత‌రెడ్డి , కుంచనపల్లె, గుంటూరు జిల్లా, సాకం బ్రహ్మానందరెడ్డి, మాసనపల్లె (సైరా), కవ్వా బాలయ్య పత్తూరు, వైఎస్సార్ జిల్లా, అయూబ్ బాషా, వెలుగోడు, నంద్యాల జిల్లా, మార్తల వెంకటసుబ్బారెడ్డి, రంగసాయిపల్లె, వైఎస్సార్‌జిల్లా.

మహానందీశ్వర భక్తులకు వసతి కబురు

- రూ. 10.50 కోట్లతో 55 వసతి గృహాలు
- ఆమోదం తెలిపిన ఎవాల్యుయేషన్ కమిటీ అధికారులు
- త్వరలో నిర్మాణం పనులు ప్రారంభం



వసతి గృహాల నమూనా

మహానంది: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు వసతి కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం క్షేత్ర పరిధిలో వసతి గృహాలు చాలా తక్కువగా ఉండటంతో భక్తు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మహానంది దేవస్థానం కార్య నిర్వహణ అధికారిగా బా ధ్యతలు స్వీకరించిన కాపు చంద్రశేఖర్ రెడ్డి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. మహానంది ఆలయానికి గతేడాది భారీగా రూ. 16.89 కోట్లు ఆదాయం రావడమే ఇందుకు నిదర్శనం. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే శ్రీ మహానందీశ్వర గర్భాలయానికి దాతల సహకారంతో వెండి మహాద్వారం, అమ్మవారి ఆలయానికి ఏర్పాటు చేయించారు. వివిధ ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో భక్తులకు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. తాజాగా శనివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో దేవస్థానం నిధులతో 55 వసతి గృహాల నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి.

తీరనున్న భక్తుల వసతి కష్టాలు

మహానందీశ్వర స్వామి వారి దర్శనార్థం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే భక్తుల రద్దీకి అనుగుణంగా మహానంది దేవస్థానం ఆధ్వర్యంలో వసతి గృహాలు తక్కువగా ఉన్నాయి. టీటీడీ వసతి గృహాల్లో 40, నాగనందిలో 25 గదులు మాత్రమే ఉన్నాయి. భక్తుల సంఖ్యకు సరిపడా లేకపోవడంతో భక్తులు ప్రైవేట్ వసతి గృహాల వైపు వెళ్లాల్సి వస్తుంది. దీంతో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో మహానంది దేవస్థానం నిధులు రూ. 10.55 కోట్లతో 55 వసతి గృహాలను సుందరంగా నిర్మించేందుకు ప్రణాళికలు పూర్తి చేశారు. గతంలో వీటి ఆమోదానికి సంబంధించి కమిషనర్‌కు నివేదికలు పంపించారు. తాజాగా శనివారం విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణ, ఆర్‌అండ్ బీ, దేవదాయ శాఖల సీఈలు, ఇతర ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈనెల 6వ తేది టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారులు వసతి గృహాల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. దీంతో త్వరలోనే 55 వసతి గదుల సముదాయం నిర్మించేందుకు అనుమతులు లభించడంతో మహానందీశ్వర స్వామి భక్తులకు శుభవార్త అనే చెప్పాలి.

భక్తులకు సౌకర్యాల కల్పనే లక్ష్యం

మహానందీశ్వర స్వామి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. శ్రీశైలం తరహాలో మహానంది ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగానే ఆయన సొంత డబ్బులు సుమారు రూ. 3 కోట్లు వెచ్చించి ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. వసతి గదుల సముదాయం నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కృషి ఉంది. – కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ